సాక్షి
మంచిర్యాల
బుధవారం ; 15 ; మే ; 2024



కుటుంబ సభ్యులతో సరదాగా..

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. రెండునెలల పాటు ప్రచారంలో బిజీబిజీగా ఉన్న నేతలు మంగళవారం కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. 8లో▸



వడ్లు జోకుత లేరు

ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతల పాట్లు అన్నీఇన్నీ కావు. రోడ్లపై వడ్లు పోసి రోజుల తరబడి నిరీక్షిస్తున్నా తూకం వేయడంలేదు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.0 /28.0

ఉష్ణోగ్రతలు నిలకడగా ఉంటాయి. పలుచోట్ల ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన వివేక్, వంశీ



రేవంత్‌తో వివేక్, వంశీకృష్ణ

చెన్నూర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నెలపాటు బిజీబిజీగా గడిపిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ఆయన తనయుడు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఓటింగ్ సరళిపై చర్చించారు. కాగా, పెద్దపల్లిలో ఘన విజయం సాధిస్తామని రేవంత్‌రెడ్డికి వివేక్, వంశీకృష్ణ వివరించినట్లు సమాచారం.

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబుతో పీఎస్సార్



భట్టి, శ్రీధర్‌బాబుతో పీఎస్సార్, నాయకులు

మంచిర్యాలటౌన్/దండేపల్లి: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పార్లమెంట్ ఎన్నికలు పూర్తి కావడంతో మంగళవారం మంథని నియోజకవర్గంలోని ధన్వాడలో నిర్వహించిన ఆలయ మూడో వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానం మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి పూజలో పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, మంత్రిని సన్మానించారు. దండేపల్లి ఎంపీపీ శ్రీనివాస్, ఆర్‌జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకుడు వెంగల్‌రావ్ తదితరులున్నారు.

మేకల మండి స్థలాన్ని మార్చాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని మేకల మండిని గతంలో నిర్వహించిన ప్రాంతానికి మార్చాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ నహీం పాషా మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల మున్సిపాలిటీ మేకల మండికి మార్చిలో వేలం నిర్వహించగా, రూ.22 లక్షలకు ఒకరు దక్కించుకున్నారని తెలిపారు. దీనికి 18 శాతం జీఎస్టీ కలిపితే రూ.26 లక్షలు మున్సిపాలిటీకి ఏప్రిల్ 31వ తేదీలోపు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. కానీ.. మండి దక్కించుకున్న వ్యక్తి వేలం డబ్బులు చెల్లించకున్నా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికి రూ.4లక్షలే చెల్లించి మండి నిర్వహిస్తున్నారని తెలిపారు. మిగతా డబ్బులు వసూలు చేయడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. రాళ్లవాగు సమీపంలో నిర్వహించే మేకల మండిని పాతమంచిర్యాలకు తరలించడంతో దగ్గరలోనే ఉన్న వేంపల్లి మేకల మండికి నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. గతంలో వేంపల్లి మేకల మండికి రూ.45 లక్షల వేలం జరగ్గా, పాతమంచిర్యాలలో నిర్వహించే మేకల మండితో వేంపల్లిలోని మండికి నష్టం కలుగుతుందని తెలిపారు. పాత మంచిర్యాలలోని మేకల మండిని గతంలో ఉన్న స్థలానికి తరలించేలా చర్యలు చేపట్టి, వేంపల్లి గ్రామపంచాయతీకి వచ్చే ఆదాయాన్ని నష్టపోకుండా చూడాలని కోరారు.

బ్రిడ్జి నిర్మాణ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మోహన్‌నాయక్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల–అంతర్గాంల మధ్య గోదావరి నదిపై చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని మంగళవారం రోడ్లు భవనాల శాఖ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ ఇంజినీర్ మోహన్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి బ్రిడ్జి సాధన సమితి సభ్యులు వెంటనే వంతెన పనులు ప్రారంభించాలని మోహన్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి వంతెనను వేరే చోటుకు మార్చాలని కాలయాపన చేస్తూ పనులు జరగకుండా చూస్తుందని ఆరోపించారు. వంతెన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. ఐబీ నుంచి శ్రీనివాస గార్డెన్ వరకు టెండర్లు పూర్తయిన రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. గోదావరి వంతెన సాధన సమితి నా యకులు తుల మధుసూదన్‌రావు, కనుకుంట్ల మల్లయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు సిరికొండ బోస్, పూట్ల సత్యనారాయణ, సూర్యనారాయణ, రాజబాబు, యాదగిరి, తిరుపతి, రాజలింగు, మహేశ్, శివ, దాస్య నాయక్ పాల్గొన్నారు.

ఓట్లు ఎటు పడ్డయో..!

- పోలింగ్ సరళిపై అభ్యర్థుల్లో టెన్షన్
- సైలెంట్ ఓటింగ్‌తో నేతల పరేషాన్
- బూత్‌లవారీగా లెక్కలతో విశ్లేషణ
- అభ్యర్థుల్లో ఎవరి ధీమా వారిదే..



హాజీపూర్ మండలం ముల్కల ఐజా ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపర్చిన ఈవీఎంలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఫలితాలపై ఎవరికి వారే అంచనాలు వేసుకుంటున్నారు. ఏ ఓట్లు.. ఎటు పడ్డయోనని వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆరా తీస్తున్నారు. ఈ నెల 13న పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌పైనే అంతటా చర్చ నడుస్తోంది. ఎంపీగా ఎవరు గెలుస్తారనే అంశంపైనే ఎక్కడికక్కడ లెక్కలు తీస్తున్నారు. రెండురోజులుగా పోలింగ్ సరళిపై అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లు, బూత్ ఇన్‌చార్జీలు, నాయకులతో పోలింగ్ సరళి తెలుసుకుని అంచనా వేసుకుంటున్నారు. పెద్దపల్లి బరిలో 42మంది అభ్యర్థులు ఉండగా, ఇందులో ప్రధానంగా మూడు రాజకీయ పార్టీలు పోటాపోటీగా గెలుపు కోసం శ్రమించాయి. వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు ఉండటంతో అప్పటి దాకా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ అభ్యర్థి గెలుస్తారని అంటుండగా, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు తమకూ గెలుపు అవకాశాలున్నాయని చెబుతున్నారు.

పెరిగిన పోలింగ్‌తో మేలెవరికో!

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో స్వల్పంగా పోలింగ్‌శాతం పెరిగింది. 2019లో 65.43శాతం పోలవగా, తాజాగా 67.87 పోలింగ్ శాతం నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే లక్షకు పైగా ఓటర్లు పెరగగా, అంతే మొత్తంలో పోలింగ్ శాతం కూడా ఎక్కువగా నమోదైంది. దీంతో గత ఎంపీ ఎన్నికలతో పోలిస్తే పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభమనే చర్చ సాగుతోంది. ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం తగ్గింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటింగ్‌లో తగ్గుదల ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఏడు నియోజకవర్గాల్లో స్పష్టమైన మెజార్టీ వచ్చింది. ఈ క్రమంలో తాజాగా లోక్‌సభ ఓటింగ్‌లో ఎటువైపు ఓటర్లు మొగ్గుచూపారనేది ఆసక్తికరంగా మారింది.

సైలెంట్ ఓటింగ్‌తో గుబులు

అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభ పోలింగ్‌లో ఓటర్లు వైవిధ్యం చూపించినట్లుగా చర్చ జరుగుతోంది. దీంతో అభ్యర్థులకు సైలెంట్ ఓట్లతో గుబులు రేపుతోంది. ఇక శాసనసభ, లోక్‌సభకు ప్రజాప్రతినిధుల ఎన్నికలో జాతీయస్థాయి రాజకీయాలు ప్రభావం చూపించినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో అంతా అనుకున్నట్లుగా ఒక పార్టీకే జనం మొగ్గు చూపకుండా సైలెంట్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఏ అభ్యర్థికి మెజార్టీ ఇస్తారనేది జూన్ 4వరకు వేచి చూడాల్సిందే.

2019లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
చెన్నూరు	1,75,513	1,23,257	70.23
బెల్లంపల్లి	1,64,275	1,13,030	68.81
మంచిర్యాల	2,50,211	1,48,604	59.39
ధర్మపురి	2,18,484	1,51,002	69.11
రామగుండం	2,12,197	1,18,431	55.81
మంథని	2,20,129	1,49,741	68.02
పెద్దపల్లి	2,37,253	1,63,054	68.73
మొత్తం	14,78,062	9,67,119	65.43

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా ఓట్ల వివరాలు

	మొత్తం ఓట్లు				పోలైన ఓట్లు				
నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	శాతం
చెన్నూర్	96,019	97,752	07	1,93,778	67,172	65,613	02	1,32,787	68.53
బెల్లంపల్లి	87,283	89,219	12	89,219	63,449	61,801	05	1,25,255	70.96
మంచిర్యాల	1,38,064	1,40,648	26	2,78,7738	85,152	84,437	02	1,69,591	60.84
ధర్మపురి	1,12,442	1,18,338	06	2,30,786	78,900	90,357	01	1,69,258	73.34
రామగుండం	1,09,826	1,09,870	27	2,19,723	69,613	65,704	13	1,35,330	61.59
మంథని	1,17,352	1,22,329	18	2,39,699	83,720	84,023	07	1,67,750	69.98
పెద్దపల్లి	1,26,719	1,30,466	07	2,57,192	92,768	90,711	03	1,83,482	71.34
మొత్తం	7,87,705	8,08,622	103	15,96,430	5,40,774	5,42,646	33	10,83,453	67.87

మూడంచెల భద్రత



స్ట్రాంగ్‌రూమ్ వద్ద పరిశీలకుడు రావేశ్‌గుప్తా, కలెక్టర్ సంతోష్, డీసీపీ అశోక్‌కుమార్

- స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద నిరంతర నిఘా
- రామగుండం సీపీ శ్రీనివాసులు
- ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన పార్లమెట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రంలోని స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన లె క్కింపు కేంద్రంతో పాటు స్ట్రాంగ్‌రూమ్‌లను పరి శీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసేలా చూస్తామని చెప్పారు. లెక్కింపు కేంద్రం చుట్టూ 500 మీటర్ల వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు, లెక్కింపు అధికారులు, పోలీస్ అధికారులు, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అలాగే పోలింగ్ పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, లెక్కింపు కేంద్రం వద్ద 24 గంటల పాటు స్థానిక పోలీసులతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్, కేంద్ర బలగాల సాయుధ రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అగ్నిమాపక పరికరాలూ లెక్కింపు కేంద్రంలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కేంద్రం మొత్తం ఒక ఏసీపీ, ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఇతర సిబ్బంది అధీనంలో ఉంటుందని తెలిపారు. లెక్కింపురోజూ అందరినీ పూర్తిస్థాయిలో పరిశీలించాకే లోనికి పంపిస్తామని పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రం పరిధిలో ఆంక్షలు పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీపీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, మంచిర్యాలరూరల్ సీఐ అశోక్, మహిళా ఠాణా సీఐ వెంకటనర్సయ్య, ఎస్సై సురేశ్ ఉన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లకు ఎన్నికల సామగ్రి

- పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీజ్
- కౌంటింగ్ సెంటర్ వద్ద బందోబస్తు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని మంచి ర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలకు సంబంధించిన పార్లమెంట్ ఎన్నికల సామగ్రి భారీ బందోబస్తు మధ్య సోమవారం రాత్రి హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ శివారులోని ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరుకుంది. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లతో పాటు పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, మాక్ పోల్ ధ్రు వప్రతాలు, పీవో డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్లు తది తర ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్ రూమ్‌లలో వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచారు. అనంతరం లెక్కింపు కేంద్రాన్ని పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావేశ్‌గుప్తా, పోలీస్ పరి శీలకుడు మనీశ్‌చౌదరి, డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ ప్రకాశ్, బెల్లంపల్లి ఏఆర్వో, అదనపు కలెక్టర్ రాహు ల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, చెన్నూర్ ఏఆర్వో చంద్రకళ, మంచిర్యాల ఏఆర్వో, ఆర్డీవో రాములు పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లను సీజ్ చేశారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

పచ్చడి కరువాయె



- పేదింట పచ్చడి మెతుకులూ కష్టమే
- జిల్లాలో తగ్గిన మామిడి దిగుబడి
- మార్కెట్‌లో బెంబేలెత్తిస్తున్న ధరలు
- ఇదేరీతిలో నూనె, మసాలా దినుసులు

నెన్నెల: కూరగాయలు, పప్పుల ధరలు మండిపోతున్నాయి. మార్కెట్‌లో వీటి ధరలు చూసి సాధారణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పచ్చడి మెతుకులు తిందామనుకుంటే అవి కూడా కరువయ్యే పరిస్థితి దాపురించింది. కాత లేక పచ్చడి మామిడికి డిమాండ్ పెరిగింది. సామాన్యులకు అందనంత దూరంగా ధర అమాంతం పెరిగింది. రూ.2, రూ.3కు దొరికే ఒక్కో మామిడి కాయ.. ప్రస్తుతం రూ.8 నుంచి రూ.10 పలుకుతోంది. గ్రామాల్లో పేద, మధ్యతరగతి ప్రజలు 100 నుంచి 200 కాయల నిల్వ పచ్చడి పెట్టుకుని ఏడాదంతా వాడుకుంటారు. మామిడి కొరతతో పాటు పచ్చడికి వాడే వెల్లుల్లి, నూనె, జీలకర, ఆవాలు, మెంతులు తదితర మసాలా దినుసుల ధరలు కొండెక్కాయి. ఈ ఏడాది పచ్చడి పెట్టే పరిస్థితి లేదని సాధారణ ప్రజలు వాపోతున్నారు.

వేసవి వచ్చిందంటే..

వేసవి వచ్చిందంటే అన్ని వర్గాల ప్రజలు మొదట మామిడికాయ పచ్చడిపైనే దృష్టి సారిస్తారు. ఇందు కోసం మేలు రకం కాయలు ఎంచుకుని పచ్చడి పెట్టడం ఆనవాయితీ. ఇళ్లల్లో ఉపయోగానికే కాకుండా దూరప్రాంతాల్లో ఉంటున్న బంధువులు, కుటుంబీకులకు పంపించేందుకు అవసరమైన పచ్చడి కోసం ఏర్పాట్లు చేసుకుంటారు. కానీ.. ఈసారి తెగులుతో మామిడి కాత పెద్దగా రాలేదు. కొద్దిపాటి కాత ఉండగా గాలిదుమారానికి చాలావరకు రాలింది. దీంతో మామిడికాయల ధరలు పెరిగాయి. పచ్చడి కాయలు కొనేందుకు మార్కెట్‌కు వస్తున్న వారు ధరలు చూసి నిరాశగా వెనుదిరుగుతున్నారు.

తక్కువ మోతాదులోనే..

చాలామంది ఇళ్లల్లో మామిడికాయ పచ్చడి ఇష్టంగా తింటారు. ఉదయం కూలీలకు వెళ్లేవారు, ఉద్యోగులు విధులకు వెళ్లే వారి టిఫిన్ బాక్స్‌ల్లో పచ్చడి తప్పక ఉండాల్సిందే. కానీ.. ఈసారి కాయల కొరత, పెరిగిన ధరలతో పచ్చడి పెట్టేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపించడంలేదు. కొందరు పచ్చడి పెడుతున్నా 50 కాయలకు బదులు 10, 20తో సరిపుచ్చుకుంటున్నారు. దీంతో బంధువులకు పంపించడం మాటేమోగాని ఇంట్లో పెట్టిన పచ్చడి జాగ్రత్తగా కాపాడుకుంటూ తినాల్సిందేనని చెబుతున్నారు.

ఖర్చు ఇలా..

ఈసారి మామిడికాయలకు ధర పెరిగింది. కిలో నూనె ధర కూడా రూ.200కు పైగా ఉంది. మామిడి కాయల ముక్కలు కొట్టించడం, కారం పట్టించే ఖర్చు, ఎల్లిపాయలు, మెంతులు, ఉప్పు, ఆవాలు, ఇలా దినుసుల ధరలన్నీ పెరిగాయి. ఫలితంగా ఈసారి పచ్చడి పెట్టడం భారంగా మారిందని సామాన్యులు వాపోతున్నారు.

పచ్చడి జోలికి వెళ్లడం లేదు



ప్రతిరోజూ ఉదయం వంట చేసుకునే పరిస్థితి ఉండని కారణంగా పనులకు వెళ్లేటప్పుడు టిఫిన్ బాక్స్‌లో మామిడికాయ పచ్చడి పెట్టుకుని వెళ్తాం. ఈసారి మామిడికాయల ధరే కాదు.. నూనె ధర, మసాలా దినుసుల ధరలు పెరిగినయ్. దీంతో ఈ ఏడాది పచ్చడి జోలికి వెళ్లలేదు. 10 కాయలతో పచ్చడి పెట్టాలనే ధైర్యం చేయలేకపోతున్నం.

– రేవెల్లి కళావతి, నెన్నెల

రుణ ప్రణాళిక ఖరారు

- రూ.70 కోట్లు ఇవ్వాలని టార్గెట్
- లక్ష్య సాధనకు ప్రత్యేక కార్యాచరణ

జిల్లాలో వీవోలు: 701	ఎస్‌హెచ్‌జీలు : 16,656
	సభ్యులు : 1,76,142



స్త్రీనిధి రుణాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

పాతమంచిర్యాల: స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా స్త్రీనిధి రుణాలు ఇస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మహిళా సంఘాలకు రుణాల మంజూరుకు స్త్రీనిధి రుణ ప్రణాళిక రూపొందించింది. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని నిర్ణీత వ్యవధిలో చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.70 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ ద్వారా, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ఆధ్వర్యంలో రుణాలు అందించనున్నారు. స్త్రీనిధి పథకంలో సువిధ, ప్రగతి, జీవనోపాధులు, సౌభాగ్య తదితర విభాగాల్లో రుణాలు అందజేస్తారు. సువిధలో రూ.40వేల వరకు, ప్రగతిలో రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు, జీవనోపాధులకు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు, సౌభాగ్యలో రూ.1.25 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు పొందవచ్చు. జిల్లాలో ఈ సంవత్సరం పాడిగేదెల పెంపకం కోసం 300 యూనిట్లు కేటాయించారు. పొట్టేళ్ల పెంపకం యూనిట్లు 40, పౌల్ట్రీఫాం యూనిట్లు 600, చిన్నకోడి పిల్లల పెంపకం యూనిట్లు 4, పందిరి సాగు కూరగాయల పెంపకం యూనిట్లు 40, జనరిక్ మెడికల్‌స్టోర్‌లు 5, ఇంటిరిపేర్‌లు, రినోవేషన్ యూనిట్లు 40, టెంట్ హౌస్ యూనిట్లు 5, ఎలక్ట్రికల్ ఆటో యూనిట్లు 40, కొత్త టూవీలర్ (ఎలక్ట్రికల్) కొనుగోలు యూనిట్లు 65, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు యూనిట్లు 350 ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రుణ లక్ష్యం చేరుకోవడానికి ప్రత్యేకంగా ప్రణాళికలు తయారు చేశామని, మే నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు టార్గెట్ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

స్త్రీనిధి రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. మహిళల కోసం జనరిక్ మెడికల్‌స్టోర్‌లు ఏర్పాటు కోసం రుణ సౌకర్యం కల్పిస్తున్నాం. విద్యావంతులు, ఆయా రంగాల్లో అనుభవం ఉన్నవారు తమకు నచ్చిన యూనిట్ ఏర్పాటు చేసుకుని లాభాలు పొందవచ్చు.

– కిషన్, డీఆర్డీవో

ఆర్థికంగా ఎదగాలి

ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా ఇస్తున్న బ్యాంక్ రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి. అర్హులకు రుణసౌకర్యం కల్పించేందుకు మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రుణాలు పొందినవారు సకాలంలో చెల్లిస్తే మళ్లీ రుణం పొందే అవకాశముంది.

– వెంకటరమణ, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్ మంచిర్యాల

నత్తనడకన భవన నిర్మాణం

- పూర్తికాని లైబ్రరీ, ఇన్నోవేషన్ సెంటర్
- ఇబ్బందుల్లో పాఠకులు, నిరుద్యోగులు



శిలాఫలకం



నిర్మాణంలో ఉన్న భవనం

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని ఐబీ ఆవరణలో చేపట్టిన లైబ్రరీ కమ్ ఇన్నోవేషన్ సెంటర్ (గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి కేంద్రం) భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. రూ.8 కోట్ల నిధులతో తేదీ 8.11.2011న ప్రజా రోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్‌శాఖ పర్యవేక్షణలో పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకనో.. మరే కారణమో.. తెలియదు గాని.. ఏళ్లు గడిచినా పనులు ముందుకుసాగడం లేదు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి కంప్యూటర్, ఇతర నైపుణ్యాలను అందించేలా భవనాన్ని తీర్చిదిద్దాలనుకున్నా పనులు ముందుకు సాగకపోవటంతో పాఠకులు, నిరుద్యోగులు నిరాశకు లోనవుతున్నారు. స్థానిక గాంధీ పార్కు పక్కన ఉన్న గ్రంథాలయంతో పాటు నూతన భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తే పుస్తకాల సంఖ్య పెరిగే అవకాశముంది. పోటీ పరీక్షలకు అవసరమైన ప్రతీ పుస్తకం ఇక్కడ దొరుకుతుందనే నమ్మకం నిరుద్యోగుల్లో కలుగుతుంది. చందాదారులు కూడా పెరిగే అవకాశముంది. వెంటనే భవన నిర్మాణం పూర్తి చేసి తమ ఇబ్బందులు తీర్చాలని పాఠకులు, నిరుద్యోగులు కోరుతున్నారు.

క్లుప్తంగా

టీచర్ సదానందం హఠాన్మరణం



సదానందం(ఫైల్)

మంచిర్యాల అర్బన్: ఎన్నికల విధులు ముగించుకుని వచ్చిన మరుసటి రోజు ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) టీచర్ గడిగొప్పుల సదానందం గుండె నొప్పితో హఠాన్మరణం చెందడం తీవ్ర విషాదం నింపింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గోపాల్‌వాడకు చెందిన సదానందం రామకృష్ణాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా కాసిపేట్ మండలం మల్కపల్లిలో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ఎన్నికల విధులు కేటాయించారు. సోమవారం ఎన్నికలు ముగియగానే ఇంటికి తిరిగివచ్చారు. గుండెలో నొప్పితో పాటు నీరసంగా ఉండడంతో మంగళవారం ఉదయం మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ నొప్పి ఎక్కువగా రావడంతో మెరుగైన వైద్యంకోసం మరో ఆస్పత్రికి తరలించగా పరీక్షలు నిర్వహిస్తుండగానే మృతి చెందారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

బెజ్జూర్: ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలంలోని కృష్ణపెల్లి గ్రామానికి చెందిన ఆటో మంగళవారం మహారాష్ట్ర నుంచి ప్రయాణికులతో బెజ్జూర్‌కు వస్తుండగా కోయపల్లి–నాగెపెల్లి గ్రామాల మధ్య అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ఎలుకపెల్లి గ్రామానికి చెందిన గోలేటి జానాబాయికి తీవ్రంగా సోనా బాల, హరీష్‌బాలకు స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ సభ్యులతో సరదాగా..

పార్లమెంట్ ఎన్నికల మహాక్రతువు ముగిసింది. ప్రచారంలో భాగంగా రెండునెలలపాటు నేతలు తీరిక లేకుండా గడిపారు. సోమవారం పోలింగ్ ముగియడంతో మంగళవారం సేదదీరుతూ కనిపించారు. రోజంతా ఇంట్లోనే ఉండి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. నాయకులు, కార్యకర్తలతో పోలింగ్‌సరళిపై సమీక్షించారు.

–ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలటౌన్/ఉట్నూర్‌రూరల్/భైంసాటౌన్/నేరడిగొండ/కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్:



ఉట్నూర్‌రూరల్: ఇంట్లో రొట్టె చేస్తున్న ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ



ఉట్నూర్‌రూరల్: కుమారులతో చెస్ ఆడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



నేరడిగొండ: కుటుంబ సభ్యులతో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



ఆదిలాబాద్‌టౌన్: కార్యకర్తలతో ముచ్చటిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



భైంసాటౌన్: తమ నివాసంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్



మంచిర్యాలటౌన్: ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మంచిర్యాలలోని నివాసంలో బీజేపీ నాయకులతో 'గోమాస' సమీక్ష



మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ నాయకులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



కాగజ్‌నగర్‌లోని నివాసంలో కార్యకర్తలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ఇందారం ఓసీ పనులు అడ్డగింత

జైపూర్: ఇందారం ఓపెన్‌కాస్టులో స్థానిక భూనిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ యువకులు ఆందోళనబాట పట్టారు. మంగళవారం ఉదయం షిఫ్టులో లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తూ భూనిర్వాసితులకు మొండిచేయి చూపిస్తున్నారన్నారు. ఓపెన్ కాస్టులో భూములు కోల్పోవడమే కాకుండా దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతుంటే ఉపాధి అవకాశాలు మాత్రం ఇతర ప్రాంతాల వారికి కల్పించడం సరికాదన్నారు. స్పందించిన పీవో శ్రీనివాస్ యువకులతో మాట్లాడి విడతల వారీగా స్థానికులకే అవకాశాలు కల్పిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.



యువకులు అడ్డుకోవడంతో నిలిచిన లారీలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలోని కన్నాల శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు. గ్రామానికి చెందిన మంద లచ్చయ్య బీడు భూమిలో ఓ వ్యక్తి పడి ఉండడాన్ని గమనించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తాళ్లగురిజాల పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై నరేష్, ఏఎస్సై రాజన్న ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మూడురోజుల క్రితం మరణించినట్లు గుర్తించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, వివరాలు తెలిసిన వారు తాళ్లగురిజాల పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఎస్సై 8712656563, సీఐ 87212656561 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.



గుర్తు తెలియని మృతదేహం

క్రాస్ ఓటింగ్‌పై సర్వత్రా చర్చ

- గెలుపుపై ఆశలు పెట్టుకున్న సదరు పార్టీ శ్రేణుల్లో కలవరం
- అభ్యర్థికి ముచ్చెమటలు పట్టిస్తున్నట్లు చర్చ



బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి క్రాస్ ఓటింగ్ జరిగిందనే ప్రచారం సాగుతోంది. బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓ జాతీయ రాజకీయ పార్టీ ఓట్లు అనూహ్యంగా మరో జాతీయ రాజకీయపార్టీకి మళ్లాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈక్రమంలో గెలుపుపై ఆశలు పెంచుకున్న సదరు పార్టీ శ్రేణుల్లో కలవర పాటు మొదలైంది. కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఓ జాతీయ రాజకీయ పార్టీ తీవ్ర స్థాయిలో ప్రచారం సాగించగా అధికారంలో ఉన్న మరో జాతీయ పార్టీ మళ్లీ గెలవాలనే తలంపుతో పోటా పోటీగా ప్రచారం చేసింది. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్థిక, అంగబలం కలిగి ఉన్న అభ్యర్థిని నిలబెట్టి అతని గెలుపు కోసం సర్వ శక్తులు వొడ్డినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు తమతో సరితూగరనే ధీమా వ్యక్తం చేసి జోరుగా ప్రచారం నిర్వహించింది. ఓటర్లు తమవైపే ఉన్నారని, తమ అభ్యర్థి విజయం ‹నల్లేరు మీద నడక› అన్నచందంగా వ్యవహరించారు. అయితే సోమవారం పోలింగ్ ముగిసిన తర్వాత కానీ ఓటరు నాడి బయటపడలేదని చెబుతున్నారు. ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన తీరుకు భిన్నంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేశారనే ప్రచారం అసెంబ్లీ నియోజకవర్గంలో కోడై కూస్తోంది. ఈతీరే అర్థబలం, అంగబలం ఉన్న అభ్యర్థికి ముచ్చెమటలు పట్టిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

ఓటర్ల తీరు మారిందా?

అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితికి ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లలో ఎంతో మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో తలపడిన ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులు ఈసారి ఓటర్లను ప్రభావితం చేయలేకపోయాయి. కేవలం ప్రచారంపైనే దృష్టిసారించి ఓటర్లను ఆకర్షించే యత్నాలకు తెర దించినట్లు తెలుస్తోంది. దీంతో ఓటర్ల మనోగతంలో ఒక్కసారిగా మార్పు వచ్చినట్లుగా చెబుతున్నారు. అర్థబలం కలిగిన ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థిపై ఆశలు పెంచుకుని తీవ్ర నిరాశకు గురైనట్లుగా రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈకారణంగానే ఓటర్లు అనివార్యంగా మరో జాతీయ పార్టీ అభ్యర్థికి స్వచ్ఛందంగా ఓటు వేయాలని భావించినట్లుగా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓ జాతీయ పార్టీని ఆదరించినట్లుగానే కేంద్రంలోనూ మరో పార్టీని గెలిపించాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

క్రాస్ ఓటింగ్‌కు సై అన్నారా?

పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ప్రధాన రాజకీయ పార్టీల మధ్యనే పోటీ కనిపించింది. ఆ మూడు పార్టీల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవి చూసిన రాజకీయ పార్టీ గట్టిపోటీని ఇస్తుందని ప్రత్యర్థులు భావించారు. ఆ రెండు జాతీయ రాజకీయపార్టీలకు ఏమాత్రం తగ్గకుండా ప్రచార పర్వం హోరెత్తించారు. అయితే పోలింగ్ రోజున సదరు పార్టీ శ్రేణుల ఆలోచనల్లో మార్పు కనిపించినట్లుగా తెలుస్తోంది. సరైన పోటీని ఇవ్వలేక పోతున్నట్లు గ్రహించిన శ్రేణులు ఆఖరు దశలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడగొట్టిన పార్టీపై కక్ష తీర్చుకునేందుకు ప్రత్యర్థి అయిన మరో జాతీయ పార్టీకి ఓట్లు వేయాలని గుట్టుగా ప్రచారం చేసినట్లు చర్చించుకుంటున్నారు. తాము గెలువక పోయినా ఫర్వాలేదు కానీ అర్థబలం కలిగిన అభ్యర్థిని ఓడించాలనే పట్టుదలతో క్రాస్ ఓటింగ్ చేయించినట్లు ప్రచారంలో ఉంది. అదే కనుక నిజమైతే అసెంబ్లీ ఎన్నికల్లో 3 వేల వరకు ఓట్లు సాధించిన సదరు జాతీయ పార్టీ ఈసారి గణనీయమైన ఓట్లు రాబట్టుకుంటుందని చర్చ జరుగుతోంది. గెలిచినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే కొందరు అంటున్నా గట్టి పోటీ మాత్రం తప్పదని విశ్లేషిస్తున్నారు. మరోవైపు సొంత పార్టీ శ్రేణులు సైతం క్రాస్ ఓటింగ్ చేయించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్వహణలోపం.. అలంకార ప్రాయం



రంగు వెలిసిపోయి కళావిహీనంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం

- టీటీడీ కల్యాణ మండపాన్ని పట్టించుకునేవారు కరువు
- సౌకర్యాల లేమితో అద్దెకు తీసుకోని ప్రజలు
- వృథాగా ఉండడంతో ఆదాయం కోల్పోతున్న వైనం

బెల్లంపల్లి: ధార్మిక , ఆధ్యాత్మిక, శుభకార్యాల నిర్వహణ కోసం బెల్లంపల్లి కేంద్రంగా నిర్మించిన తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) కల్యాణ మండపం అలంకార ప్రాయంగా మారింది. సరైన వసతులు, నిర్వహణ లేక వృథాగా ఉంటోంది. అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో లక్షల రూపాయలతో నిర్మించిన మండపం మరింత అధ్వానంగా మారుతోంది.

శ్రీకోదండ రామాలయం ప్రక్కన....

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి శ్రీకోదండ రామాలయం పక్కన టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మించారు. దశాబ్దకాలం క్రితం రూపుదిద్దుకున్న ఈ మండపంలో నాలుగైదు ఏళ్ల వరకు కార్యక్రమాలు జరిగాయి. అద్దెకు తీసుకుని పుర ప్రజలు శుభకార్యాలు జరిపించారు. ముఖ్యంగా వివాహాలు నిర్వహించారు. శ్రీకోదండ రామాలయానికి పోటీగా ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్ల కన్నా అతి తక్కువ ధరకు కళ్యాణ మండపాన్ని అద్దెకు ఇవ్వడంతో పోటీపడి శుభ కార్యాలయాలు జరిపించారు. ఆ తర్వాత కార్యక్రమాల నిర్వహణ తగ్గుముఖం పట్టాయి. నిర్వహణను కూడా పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రస్తుతం ఏ కార్యాలూ జరుగడం లేదు. దీంతో నిరుపయోగంగా మారింది.

ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్ల వైపే మొగ్గు ....

శాఖాహారులకు టీటీడీ కళ్యాణ మండపం ఎంతగానో ఉపయోగపడింది. మున్సిపాలిటీ పరిధిలో వాసవీ కన్యకాపరమేశ్వరి, టీటీడీ కళ్యాణ మండపాలు శాఖహార వంటకాలకు వినియోగించడం జరుగుతుంది. ఇతర ఫంక్షన్ హాళ్లలో మాంసాహార వంటకాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో అనేక మంది అద్దె అధికమైనా ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లనే ఎంచుకుంటున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో ఆధునిక సౌకర్యాలు ఆకర్షిస్తున్నాయి. సౌకర్యాలను బట్టి వేల రూపాయల అద్దె వసూలు వసూలు చేస్తున్నారు. టీటీడీ కళ్యాణ మండపం అద్దె కేవలం రూ.2 వేల వరకు ఉండటంతో శాఖ హార ప్రియులు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతున్నా.. నిర్వహణ సరిగా లేక ముందుకు రావడం లేదు. కొన్ని నెలల పాటు శ్రీకోదండ రామాలయ కమిటీకి టీటీడీ కళ్యాణ మండపం నిర్వాహణ బాధ్యతలను అప్పగించగా అద్దె చెల్లించే పరిస్థితులు కూడా లేకపోవడంతో నాలుగు నెలల క్రితం టీటీడీకి అప్పగించారు.

అసౌకర్యాలకు నిలయంగా..

కళ్యాణ మండపంలో సరైన సౌకర్యాలు లేవు. ముఖ్యంగా శుభ్రత లోపించింది. దీనిని నిర్మించినప్పుడు వేసిన రంగులు మినహా కొత్తగా వేయలేదు. దీంతో అవి వెలిసిపోయి భవనం పేలవంగా కనిపిస్తోంది. ఇక మండపాన్ని నిత్యం పర్యవేక్షించే అధికారులు కరువయ్యారు. అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో వాచ్‌మెన్, స్వీపర్ సరిగా విధులు నిర్వహించడం లేదు. దీంతో చెత్త చెదారం కళ్యాణ మండపంలో పేరుకుపోతోంది. దీంతో కళ్యాణ మండపాన్ని అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. విశాలమైన గదులు, ఇతర సౌకర్యాలు ఉన్నా కూడా శుభకార్యాల నిర్వహణకు వెనుకాడుతున్నారు.

పర్యవేక్షణ చేయాలి



టీటీడీ కల్యాణ మండపాన్ని అద్దెకు ఇవ్వడానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి పర్యవేక్షణ చేయాలి. మండపంలో కార్యక్రమాల నిర్వహణకు తగిన వసతులు కలిపించాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలుతీసుకోవాలి. మండపానికి రంగులు వేయించి ప్రజలు వినియోగించుకునేలా చూడాలి.

– పొట్ల సురేశ్, మాజీ కౌన్సిలర్, బెల్లంపల్లి

ఇబ్బందులు లేకుండా..



కల్యాణ మండపంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, వివాహాది శుభకార్యాలు నిర్వహించడానికి అనువుగా తీర్చిదిద్దాలి. అద్దెకు తీసుకున్నవారు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పించాలి. నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు.

– ఇప్ప రవి, సామాజిక కార్యకర్త, బెల్లంపల్లి

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

కుభీర్: ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని భోకర్ తాలూకా బేంద్రే గ్రామానికి చెందిన జాదవ్ వినోద్ (18) రెండేళ్లుగా కుభీర్ మండలంలోని చాతా గ్రామానికి చెందిన దేవేందర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ట్రాక్టర్‌తో హల్దా వైపు వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి తల్లిదండ్రులతో పాటు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. తండ్రి రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ముగ్గురి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లి ఖిల్లాలో సోమవారం జరిగిన దాడికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. తిర్పెల్లి ఖిల్లాకు చెందిన గొర్ల రాము, గొర్ల రాకేష్ తమపై దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సిరికొండ మండల కేంద్రానికి చెందిన లింగన్న–రుకుంబాయి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. 2011లో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఒక కుమారుడు వాగులో మునిగి చనిపోయాడు. మరో కుమారుడు కోలాపురి నవీన్ (27) జిల్లా కేంద్రంలోని ఓ ఆర్థోపెడిక్ వైద్యుడి వద్ద పనిచేస్తున్నాడు. కైలాస్‌నగర్‌లోని గెజిటెడ్ ఉద్యోగుల సంఘ భవనంలో మరో మిత్రుడితో కలిసి అక్కడే ఉంటున్నాడు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు తన స్నేహితుడితో కలిసి స్వగ్రామం సిరికొండకు వెళ్లాడు. ఓటు వేసిన అనంతరం స్నేహితుడు అక్కడే ఉండిపోగా నవీన్ జిల్లా కేంద్రానికి తిరిగి వచ్చాడు. మంగళవారం ఉదయం మరో స్నేహితుడు గెజిటెడ్ సంఘ భవనానికి టిఫిన్ చేసేందుకు వెళ్లి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండడంతో పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చేతికొచ్చిన ఇద్దరు కుమారులు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తోడుగా ఉంటారనుకున్న కుమారులు కానరాని లోకాలకు వెళ్లడంతో వారు రోదించిన తీరు అందర్నీ కలచివేసింది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు

సారంగపూర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కంకెట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాణిక్యం, లక్ష్మణచాంద మండలంలో విధులు నిర్వహిస్తున్న మరో ఉపాధ్యాయుడు ముత్యం సోమవారం ఉట్నూర్‌లో జరిగిన ఎన్నికల విధుల్లో పాల్గొని అర్ధరాత్రి కారులో నిర్మల్ బయలుదేరారు. మహబూబా ఘాట్స్ వద్దకు రాగానే కారుకు అడ్డువచ్చిన అడవిపందులను తప్పించే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న బండ రాళ్లను ఢీకొట్టారు. దీంతో కారు బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి.